క్లుప్తంగా

నార్సింగి స్టాండింగ్ కౌన్సిల్‌గా అభిలాష్



మణికొండ: మున్సిపాలిటీలలో ఉన్న న్యాయపర సమస్యలను నివారించేందుకు కొత్తగా స్టాండింగ్ కౌన్సిల్‌లుగా న్యాయవాదులను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. అందులో భాగంగా నార్సింగి మున్సిపాలిటీకి సూరనేని అభిలాష్‌ను ఇటీవల నియమించింది. ఈ సందర్భంగా ఆయన సోమవారం విధులను స్వీకరించారు.

సినర్జీ క్వాంటమ్ ఇండియా-ట్రిపుల్ ఐటీ ఎంఓయూ

రాయదుర్గం: ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ హైదరాబాద్ (ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్) సినర్జీ క్వాంటమ్ ఇండియాతో భాగస్వామ్యం చేసుకుంది. సైనిక, పౌర వినియోగ సందర్భాలలో సాంకేతికత, వాటి అనువర్తనాలను అభివృద్ధి చేయడం ఈ సహకారం లక్ష్యం. ఈ ఒప్పందం ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌కి ఒక ముఖ్యమైన మైలురాయి. ఈ సందర్భంగా ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ పిజే నారాయణన్ మాట్లాడుతూ ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ దేశంలోనే అత్యంత విస్తృతమైన క్వాంటం కంప్యూటింగ్ రీసెర్చ్ గ్రూపులలో ఒకటని అన్నారు.

సహకారం పెంపొందించుకోవడమే లక్ష్యం

మనూ వీసీ ఐనుల్ హసన్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంను సోమవారం సాయంత్రం రిపబ్లిక్ ఆఫ్ టర్కీ కాన్సులేట్ కాన్సుల్ జనరల్ ఓర్హాన్‌యల్మాన్ ఓకాన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఉర్దూ యూనివర్సిటీ క్యాంపస్‌లోని పరిపాలనా భవనంలో వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అకడమిక్ ప్రోగ్రామ్‌లలో టర్కిష్ విశ్వవిద్యాలయాలు, మనూ మధ్య అవగాహన ఒప్పందంపై కాన్సుల్ జనరల్ చర్చించారు. వీసీ ఐనుల్ హసన్ మాట్లాడుతూ సహకారం మరింత పెంపొందించుకోవడమే లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా విద్య, పరిశోధనలు, సాంస్కృతిక అంశాలపై చర్చించారు.

నేడు లంగర్‌హౌస్‌లో ఇఫ్తార్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గం లంగర్‌హౌస్ మెహిదీ కాలనీలో నేడు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తున్నామని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ తెలిపారు. ఈ ఇఫ్తార్ విందుకు హైదరాబాద్ ఎంపీ మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ హాజరుకానున్నారని ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గోల్కొండ: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. షాబాద్ మండలం షేరిగూడ గ్రామానికి చెందిన అరుణ్ కుమార్‌గౌడ్ (22) గత కొన్ని సంవత్సరాలుగా వికారాబాద్ జిల్లా పుల్కచెర్ల మండల కేంద్రంలోని తమ అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటూ పనులు చేసుకుంటున్నాడు. సోమవారం అతడు నగరానికి వచ్చి పని ముగించుకుని స్వస్థలానికి బైక్‌పై బయలుదేరాడు. లంగర్ హౌస్ మిలటరీ ఆస్పత్రి వద్ద నుంచి ఇతను వెళ్తుండగా వెనక నుంచి వేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అరుణ్‌కుమార్‌గౌడ్ తీవ్రంగా గాయపడ్డాడు. కాగా అతనికి పోలీసులు చికిత్స నిమిత్తం గోల్కొండ ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అతనిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించాడు. కాగా చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు. కాగా మృతుడి ఫోన్‌తో పోలీసులు థంబ్ ఇంప్రెషన్ తీసుకుని అతని కుటుంబ సభ్యులతో సమాచారం ఇచ్చారు. కేసు దర్యాప్తులో ఉంది.

మోదీ సభను విజయవంతం చేయాలి



సమావేశంలో దేవర శ్రీనివాస్ తదితరులు

గోల్కొండ: రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కొన ఊపిరితో ఉందని బీజేపీ రాష్ట్ర నాయకులు దేవర శ్రీనివాస్ అన్నారు. సోమవారం గుడిమల్కాపూర్‌లో బీజేపీ ముఖ్య పదాధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఖాన్‌ల ప్రభుత్వంగా మారిందని, ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులే భారీ అవినీతి కుంభకోణాల్లో కూరుకుపోయారన్నారు. బీఆర్ఎస్ అవినీతి పాలనతో రాష్ట్ర ప్రజలు విసుగెత్తిపోయారని రాష్ట్ర ప్రజలందరూ నేడు బీజేపీని ఆదరిస్తున్నారని ఆయన అన్నారు. దేవర వంశీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజలకు జవాబుదారీ ఇవ్వలేని ముఖ్యమంత్రి తన పార్టీని జాతీయ పార్టీగా ప్రకటించుకోవడం విడ్డూరమన్నారు. ఈనెల 8న నగరంలో జరగనున్న ప్రధాని మోదీ సభకు గుడిమల్కాపూర్ డివిజన్ నుంచి భారీగా తరలివెళ్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నామా యాదగిరి, రాధాకృష్ణయాదవ్, అశ్విన్ మోది, ప్రభు పూజారి పాల్గొన్నారు.

మొదటి రోజు 'పది' పరీక్షలు ప్రశాంతం

బండ్లగూడ: పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు పాఠశాలల్లో పదవ తరగతి పరీక్షల సెంటర్లు ఏర్పాటు చేశారు. విద్యార్థులు సెంటర్ల వద్దకు గంట ముందుగానే వచ్చి సెంటర్‌లోకి వెళ్లారు. విద్యార్థులను వారి తల్లిదండ్రులు సెంటర్ల వద్దకు తీసుకువచ్చి పరీక్షల అనంతరం తీసుకువెళ్లారు. కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మొదటి రోజు సోమవారం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమైయ్యాయి.



పరీక్ష రాసేందుకు లోనికి వెళ్లడంతో పాఠశాల గేటు వద్ద వేచి ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు



పరీక్షా కేంద్రం వద్ద వేచి ఉన్న విద్యార్థులు



పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

ప్రశాంతంగా ప్రారంభమైన పరీక్షలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. సోమవారం మొదటి రోజు సందర్భంగా విద్యార్థులను తల్లిదండ్రులు సెంటర్ల వద్దకు తీసుకురావడం కనిపించింది. ఉదయం 9 గంటలకే పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు చేరుకున్నారు. సర్కిల్ పరిధిలో 19 సెంటర్లల్లో 4355 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. మొదటి రోజు 32 మంది విద్యార్థులకు గైర్హాజరైనట్లు ఎంఈఓ రామిరెడ్డి తెలిపారు. విద్యార్థులను తనిఖీ చేసిన అనంతరమే సెంటర్లలోకి అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. సెంటర్లల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టామన్నారు.

22 మంది గైర్హాజరు

శంషాబాద్: శంషాబాద్‌లో పది పరీక్షలకు 22 మంది విద్యార్థులు వివిధ కారణాలతో గైర్హాజరయ్యారు. మొత్తం ఎనిమిది కేంద్రాల్లో 1840 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా తొలిరోజు 1818 మంది పరీక్షలు రాశారు. పట్టణంలో జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 144 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా ఇక్కడ అత్యధికంగా 15 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాలేదు.





రాజేంద్రనగర్ పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థుల సందడి

క్యాన్ నెంబర్లకు దరఖాస్తు చేయండి



జలమండలి మేనేజర్‌తో మాట్లాడుతున్న వైస్ చైర్మెన్ నరేందర్‌రెడ్డి

మణికొండ: నీటి కనెక్షన్‌లు ఉండి క్యాన్ నెంబర్, మీటర్లు లేని వారు జలమండలి కార్యాలయంలో దరఖాస్తులు చేసుకుంటే జారీ చేస్తామని జలమండలి మణికొండ డివిజన్ మేనేజర్ స్ఫూర్తిరెడ్డి అన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో గతంలో ఇంటింటికి క్యాన్ సర్వేలు చేసినా ఎక్కువ శాతం గృహాలకు అవి జారీ చేయకపోవటం, మీటర్లు ఏర్పాటు చేసుకోలేదు. దాంతో జలమండలి విజిలెన్స్ అధికారులు ఇంటికి తిరిగి వివరాలు సేకరిస్తున్నారు. అవి లేని వారికి పెద్ద మొత్తంలో జరిమానాలు విధించే ఆలోచనలో ఉన్నతాధికారులు ఉన్నట్టు సమాచారం. దాంతో సోమవారం హనుమాన్‌నగర్‌కాలనీ, శ్రీలక్ష్మిప్రియకాలనీ, ప్లెజెంట్‌వ్యాలీ కాలనీ, శ్రీనివాసనగర్ కాలనీలకు చెందిన వారు జలమండలి కార్యాలయానికి వెళ్లి క్యాన్ నెంబర్ల పరిస్థితిపై వాకబు చేశారు. గతంలో గ్రామపంచాయతీకి చెల్లించిన నీటి బిల్లుల రిసిప్టలను జలమండలి కార్యాలయంలో ఇస్తే వెంటనే సర్వే చేయించి క్యాన్ నెంబర్లను జారీ చేస్తామని, అనంతరం ఎవరింటికి వారు మీటర్లను తెచ్చుకుని ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ కె.నరేందర్‌రెడ్డి, ఆయా కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ పథకాలను ఇంటింటికీ తీసుకువెళ్లాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్: భారతీయ జనతా పార్టీని బలోపేతం చేసేందుకు ప్రజలు తమవంతు బాధ్యతగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోంద్ర సంగీత గౌరీశంకర్ వెల్లడించారు. రాజేంద్రనగర్‌లో పల్లెపల్లెకు బీజేపీ ఇంటింటికి బీజేపీ పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా అత్తాపూర్ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ సంగీతగౌరీశంకర్ మాట్లాడుతూ.. పేద ప్రజల సంక్షేమం కోసం ప్రధాని మోదీ అనేక పథకాలను ప్రవేశపెడుతున్నారన్నారు. భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు పథకాలను ఇంటింటికి తీసుకువెళ్లాలన్నారు. నాయకులు అంజన్‌కుమార్, మల్లారెడ్డి, కొమురయ్య పాల్గొన్నారు.

సమన్వయంతో సమస్యల పరిష్కారం



సమావేశంలో వెస్ట్ జోనల్ కమిషనర్ శంకరయ్య, వివిధ విభాగాల అధికారులు

జోనల్ కమిషనర్ శంకరయ్య

గచ్చిబౌలి: అధికారుల సమన్వయంతోనే ప్రజా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ శంకరయ్య అన్నారు. సోమవారం శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కార్యాలయంలో ప్రజా సమస్యలపై వివిధ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ పెరగడంతో జంక్షన్లు, రోడ్ల విస్తరణ, సర్వీస్ రోడ్ల అభివృద్ధిపై చర్చించారు. ఫుట్‌పాత్ నిర్మాణం, వాటర్ లాగింగ్ పాయింట్స్, మాన్‌సూన్ టీమ్‌లపై పలు సూచనలు చేశారు. వీధి దీపాల మరమ్మతులను వెంటనే చేపట్టాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులను జడ్సీ ఆదేశించారు. నాలాలు, రోడ్లు, ఖాళీ స్థలాల్లో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని ఉప కమిషనర్లకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్త వేర్వేరుగా స్వచ్ఛ ఆటోల్లో వేసే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. నిర్మాణ వ్యర్థాలను రోడ్లపై వేయవద్దన్నారు. ముంపు ప్రాంతాలను గుర్తించి తగు చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాదాపూర్ ఏసీపీ రఘునందన్‌రావు, పటాన్‌చెరు డీఎస్పీ భీమ్ రెడ్డి, వాటర్‌వర్క్స్ జీఎం రాజశేఖర్, డీసీలు వెంకన్న, సుధాంష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అకాడమిలో దొడ్డి కొమురయ్యకు ఘన నివాళి



పోలీస్ అకాడమీ దొడ్డి కొమరయ్యకు జయంతి కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

బండ్లగూడ: రాజారామ్ బహదూర్ వెంకటరామిరెడ్డి తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీలో దొడ్డి కొమరయ్య జయంతి ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. హిమాయత్‌సాగర్‌లోని పోలీస్ అకాడమీలోని సెమినార్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్(అడ్మిన్) రాఘవరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య చేసిన పోరాటాలను యువతకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆయన వీరోచిత పోరాటాలు ఎంతో మందిని మేల్కొలిపాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జానకి షర్మిల, అనసూయ పాల్గొన్నారు.

మణికొండ: తెలంగాణ ఉద్యమ నాయకుడు దొడ్డి కొమరయ్య జయంతిని పురస్కరించుకుని నార్సింగిలో ఆయన చిత్రపటానికి మున్సిపల్ కార్మికులు నివాళులు అర్పించారు. నార్సింగిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటాన్ని ఉంచి నివాళులర్పించి ఆయనను మననం చేసుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయు నాయకులు రుద్రకుమార్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.



అత్తాపూర్ కురుమ సంఘంలో దొడ్డి కొమరయ్య జయంతి కార్యక్రమంలో పాల్గొన్న సంఘం సభ్యులు

పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య

రాజేంద్రనగర్: రజాకర్లను తరిమికొట్టిన పోరాటాల యోధుడు దొడ్డి కొమరయ్య జయంతి కార్యక్రమాన్ని అత్తాపూర్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. అత్తాపూర్ కురుమ సంఘం ఆధ్వర్యంలో దొడ్డి కొమరయ్య చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. నిజాం నవాబులకు వ్యతిరేకంగా నినాదాలు ఇస్తూ నిజామ్ పాలనకు ఎదురొడ్డి ప్రజల్లో చైతన్యం తెచ్చినవారిలో దొడ్డి కొమరయ్య కీలక పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో మొండ్ర నర్సింహ్మా, బండారు రమేష్, మొండ్ర గౌరీశంకర్ పాల్గొన్నారు.

సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్



గచ్చిబౌలి: సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు రఘునాథ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి రఘునాథ్ యాదవ్ తెలిపారు. సోమవారం కొండాపూర్‌లో బీజేపీ శేరిలింగంపల్లి అసెంబ్లీ కన్వీనర్ రాఘవేంద్రరావు, నేషనల్ బాక్సర్ ఉదయ్‌కుమార్‌లు టోర్నమెంట్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఫైనల్ విజేతకు లక్ష రూపాయలు, రెండవ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.50 వేలు, మూడవ బహుమతిగా రూ.25 వేలు, 4,5 స్థానంలో నిలిచిన జట్లకు బహుమతులు, క్రికెట్ కిట్లు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఎంట్రీ ఫీజు రూ.500 చెల్లించి, ఏప్రిల్ 8వ తేదీలోపు జట్ల పేర్లను రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం 7396286696, 9000442204 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ప్రొ.మహ్మద్ సిద్ధిఖీకి అరుదైన గౌరవం

రాయదుర్గం: మనూ ప్రొఫెసర్ మహ్మద్ సిద్ధిఖీకి అరుదైన గౌరవం లభించింది. స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెనింగ్ డీన్, ఓఎస్‌డీ-2 ప్రొఫెసర్ సిద్ధిఖీకి హెన్రీ మార్టిన్ ఇన్‌స్టిట్యూట్ (ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ రీసెర్చ్) ద్వారా ప్రతిష్టాత్మకమైన హానోరిస్ కాసా (డాక్టర్ ఆఫ్ డివినిటీ) గౌరవ పట్టాను అందించారు. వీసీ ఐనుల్‌హసన్, రిజిస్ట్రార్ ప్రొ. ఇష్తియాక్ అహ్మద్, ఓఎస్‌డీ ప్రొఫెసర్ షగుఫ్తా షాహీన్, ఇతర అధికారులు ఆయనను అభినందించారు.



బీఆర్ఎస్‌లో చేరికలు

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌కు చెందిన పలువురు మహిళలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా సమక్షంలో ఆదివారం రాత్రి పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి వారిద్దరు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇప్పటికే నెహ్రూనగర్‌లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఖాళీ అయ్యాయని, ఇక మిగతా చోట్ల కూడా ఇదే పరిస్థితి నెలకొనడం ఖాయమన్నారు. పార్టీలో చేరిన వారిలో కల్పన, శోభారాణి, లక్ష్మీ, కవిత, భాగ్యలక్ష్మీ, రజని, సుకన్య, చంద్రలేఖ, ఆదిలక్ష్మీ, సునీత తదితరులున్నారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే గాంధీ, మాజీ కార్పొరేటర్ సాయిబాబా

బల్గేరియాకు హెచ్‌సీయూ విద్యార్థులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఇంటిగ్రేటెడ్ విద్యార్థులు బల్గేరియా పర్యటనకు ఎంపికయ్యారు. డిజిటల్ స్టోరీ టెల్లింగ్ పోటీలో విద్యార్థులు ఎన్ సంజీవిని, మహ్మద్ నసీహ్, వి.లాస్యప్రియలు గెలిచారు.ఈ ముగ్గురు జూన్/జూలై-2023లో బల్గేరియాలోని వర్నా యూనివర్శిటీ ఆఫ్ మేనేజ్‌మెంట్ నిర్వహించనున్న ఇంటర్ కల్చరల్ అవేర్‌నెస్ అండ్ కల్చరల్ డైవర్శిటీ (ఐఏసీడీ)పై రెండు వారాల 'బూట్‌క్యాంప్'కి హాజరవుతారు. వీరు తమ మొబైల్‌లో4 నిమిషాల డిజిటల్ కథనాలను ప్రత్యక్ష అనుభవం లేదా ఊహాజనిత స్క్రిప్ట్‌తో సమకాలీన వాస్తవాలను ప్రతిబింబింప చేశారు.



లాస్యప్రియ



మహ్మద్ నసీహ్



సంజీవిని

5న డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుక

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ దళిత మోర్చా ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీన డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర దళిత మోర్చా కార్యవర్గ సభ్యులు కోరని సదానందం, జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి కోరని క్రాంతి, రాజేంద్రనగర్ డివిజన్ దళిత మోర్చా అధ్యక్షులు టి.మల్లేష్, రాజేంద్రనగర్ డివిజన్ దళిత మోర్చా ప్రధాన కార్యదర్శి వేణులు తెలిపారు. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ 116వ జయంతి సందర్భంగా బుద్వేల్ ఎక్స్‌టెక్షన్ చౌరస్తాలో ఈ నెల 5వ తేదీన ఉదయం 8.30 గంటలకు జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

పేరుకుపోయిన వ్యర్థాల తొలగింపు

రాజేంద్రనగర్: రంజాన్ మాసంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎంఐఎం పార్టీ నాయకుడు మహ్మద్ జహంగీర్ వెల్లడించారు. సోమవారం మహమూద్‌నగర్, హసన్‌నగర్‌లలో ప్రత్యేక డ్రైవ్‌ను చేపట్టారు.ఈ సందర్భంగా రోడ్లపై పేరుకుపోయిన చెత్తచెదారాలు, మట్టికుప్పలు, వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రంజాన్ మాసంలో పరిసరాలు దుర్గంధంగా ఉండకుండా ప్రత్యేక చర్యలు తీసుకుటు కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



హసన్‌నగర్‌లో పేరుకుపోయిన మట్టి కుప్పలను తొలగిస్తున్న సిబ్బంది

మోసం చేసి భూమిని అమ్మిన వారిపై కేసు

శంషాబాద్ రూరల్: మోస పూరితంగా భూమిని అమ్మిన వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ కుమార్ తెలిపిన మేరకు.. నగరానికి చెందిన విశ్రాంత ప్రొఫెసర్ జి.గోపాల్‌రెడ్డి మండల పరిధిలో పెద్దగోల్కొండ రెవెన్యూ పరిధిలో 3 ఎకరాల భూమిని కొన్నాడు. గ్రామానికి చెందిన గడ్డమీది నర్సింహ, గడ్డమీది హరికృష్ణ, గడ్డమీది యాదగిరి, బాబుచందర్, అనిత నుంచి ఈ భూమిని 2018 డిసెంబరు 31న రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. రికార్డులో 3 ఎకరాలు భూమి అమ్మినప్పటికీ ఎకరా 23 గుంటలు మాత్రమే ఉంది. ఈ విషయమై భూమి అమ్మకందారులను అడగితే.. ఎస్సీ, ఎస్టీ కేసు పెడతామని గోపాల్‌రెడ్డి, అతని కొడుకులను బెదిరించారు. దీంతో తనకు మోస పూరితంగా భూమిని అమ్మడంతో పాటు బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఈ నెల 6న వీర హనుమాన్ విజయ యాత్ర

రాజేంద్రనగర్: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని వీర హనుమాన్ విజయ యాత్ర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6వ తేదీన హనుమాన్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. సాయంత్రం 6 గంటలకు ఈ ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. మైలార్‌దేవ్‌పల్లి హనుమాన్ దేవాలయం నుంచి వీర్ హనుమాన్ విజయ యాత్ర ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

హనుమాన్ శోభాయాత్రకు కట్టుదిట్టమైన భద్రత



మాట్లాడుతున్న సీపీ స్టీఫెన్ రవీంద్ర

రాయదుర్గం: హనుమాన్ శోభాయాత్రకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో సోమవారం సాయంత్రం హనుమాన్ విజయయాత్ర బందోబస్తుపై ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లా అండ్ ఆర్డర్ డీసీపీలు, ఇన్‌స్పెక్టర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాలీలు తీసే నిర్వాహకులు ముందస్తుగా స్థానిక పోలీస్‌స్టేషన్ల నుంచి విధిగా అనుమతులు పొందాలన్నారు. సంబంధిత పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు హనుమాన్ ర్యాలీ ఆర్గనైజర్లు, యువతతో పీస్ కమిటీ సమావేశాలు నిర్వహించుకోవాలన్నారు. సోషల్ మీడియాలో రూమర్లు పోస్ట్ చేసే వారిపై నిఘా ఉంచాలన్నారు. ఈ సమావేశంలో సైబరాబాద్ జాయింట్ సీపీ అవినాష్‌మహంతి, జాయింట్ సీపీ ట్రాఫిక్ నారాయణ్ నాయక్, మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి, బాలానగర్ డీసీపీ సందీప్, రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి, శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి, ట్రాఫిక్ డీసీపీ హర్షవర్ధన్, ఎస్ఓటీ డీసీపీ రషీద్, ఏడీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఔట్‌లెట్ సమస్య పరిష్కారానికి చర్యలు

శేరిలింగంపల్లి: డోయన్స్ కాలనీలో ఔట్‌లెట్ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి డివిజన్ డోయన్స్ కాలనీలో ఔట్‌లెట్ సమస్యను ఆయన సోమవారం పరిశీలించారు. రాబోయే వర్షాకాలానికి పనులన్నింటిని పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డీఈ శ్రీనివాస్, ఏఈ సునీల్, నాయకులు శ్రీనివాస్‌యాదవ్, కాలనీవాసులు లింగారెడ్డి, సంజీవరెడ్డి, బాబురావు, భీమేశ్వరరావు, అవంతి కుమార్, బెనర్జీ, సత్యనారాయణ పాల్గొన్నారు.